క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



కురవి: రాష్ట్రస్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్ పోటీలకు రాజోలు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థి ధారావత్ శివ ఎంపికైనట్లు హెచ్‌ఎం ఆళ్ల రవికుమార్, గైడ్ టీచర్ ఎం.కిషన్ సోమవారం తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థికి ప్రశంసపత్రాన్ని సోమవారం అందించారు. ఉపాధ్యాయులు వెంకటరెడ్డి, దామోదర్, మోహన్, భీకు, సురేష్, రవికుమార్, రాజేశ్వరీ, వసంత, తదితరులు అభినందించారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా శివకృష్ణ



గార్ల: బీజేపీ గార్ల మండల నూతన అధ్యక్షుడిగా నక్క శివకృష్ణను నియమిస్తూ సోమవారం బీజేపీ రాష్ట్ర ఎన్నికల అధికారి లక్ష్మీనారాయణ నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు.

ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక



మహబూబాబాద్ రూరల్: అఖిల భారత రైతు కూలి సంఘం (రెండు వేర్వేరు నిర్మాణాలు కలిగిన) విలీనం సందర్భంగా ఏఐకేఎంఎస్ రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఒకే సంస్థగా విలీనమైన నిర్మాణానికి అధ్యక్షుడిగా మామిడాల భిక్షపతి, ప్రధాన కార్యదర్శిగా మండల వెంకన్న, సభ్యులను ఎన్నుకున్నారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా వక్క వంతుల కోటేశ్వరరావు కొనసాగుతారని, ఎన్నికైన కార్యవర్గంతో జాతీయ అధ్యక్షుడు వేములపల్లి వెంకటరామయ్య ప్రతిజ్ఞ చేయించారు.

మినహాయింపు ఇవ్వాలి

మహబూబాబాద్: మానుకోట మున్సిపాలిటీకి స్టాంప్ డ్యూటీ నిమిత్తం రావాల్సిన రూ.10.53కోట్ల నిధులు విడుదల అయ్యాయని వాటి నిబంధనల విషయంలో కొంత మినహాయింపు ఇవ్వాలని మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న అన్నారు. హైదరాబాద్‌లో సోమవారం సీడీఎంఏ (కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ తెలంగాణ) టీకే.శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు.

పోరాట స్ఫూర్తితోనే గ్రీన్‌ల్యాండ్ బోర్డు

మహబూబాబాద్ అర్బన్: బీఎస్పీ పోరాట స్ఫూర్తితోనే జిల్లా కేంద్రంలోని పాత కల్లు కాంపౌండ్ నాలుగు ఎకరాల రియల్ ఎస్టేట్ భూమిలో మున్సిపల్ అధికారులు స్పందించి గ్రీన్‌ల్యాండ్ బోర్డు ఏర్పాటు చేశారని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి దార్ల శివరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సర్వేనంబర్ 677, 678, 680 భూమి రియల్ ఎస్టేట్ భూమిని సోమవారం బీఎస్పీ నాయకులు సందర్శించారు. కార్యక్రమంలో నరేష్ నాయక్, చాణిక్య పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

మహబూబాబాద్: కులాంతర, మతాంతర వివాహం చేసుకున్న అర్హులైన దంపతులకు ఇందిరమ్మ ఇంటి స్థలంతోపాటు ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణం చేసి ఇవ్వాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుడ్డెల రామ్మూర్తి డిమాండ్ చేశారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం, కుల మతాంతర వివాహితుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ కృష్ణవేణికి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రాంబాబు, యాకయ్య, సుభాష్, భార్గవి, సురేష్ పాల్గొన్నారు.

యువకుడి శ్రమదానం

కురవి: సీరోలు మండలం తాళ్లసంకీస గ్రామ పరిధిలోని బీల్యా తండాలో తండా యువకుడు వాంకుడోత్ సుమన్ అనే యువకుడు సొంత ఖర్చులతో సోమవారం శ్రమదానం చేయించాడు. తండాలోని రోడ్ల పక్కన దట్టంగా పెరిగిన ముళ్లపొందలు, కంప, చెత్తా చెదారాన్ని డోజర్ సాయంతో తొలగించి శుభ్రం చేయించాడు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

నెల్లికుదురు: రెండు మోటార్ సైకిళ్లు ఢీకొనడంతో ఒకరికి గాయాలైన సంఘటన మండలంలోని నర్సింహులగూడెం బస్టాండ్ సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మునిగలవీడు గ్రామానికి చెందిన బొబ్బల వెంకన్న తన మోటార్ సైకిల్‌పై మహబూబాబాద్ వైపునకు వెళ్తున్నాడు. మండలంలోని నర్సింహులగూడెం స్టేజి వద్ద ఎదురుగా వస్తున్న మరో మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. కిందపడిన వెంకన్నను 108 వాహనంలో మహబూబాబాద్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

కంకర పరిచి.. పనులు నిలిచి

- నత్తనడకన రోడ్డు పనులు
- నరకయాతన పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

పెద్దవంగర: అటు పోచారం, వడ్డెకొత్తపల్లి నుంచి పెద్దవంగర మండల కేంద్రానికి వచ్చేవారు.. ఇటు బొమ్మకల్లు, ఆర్‌కే తండా, ఆర్సీతండా నుంచి మండల కేంద్రానికి చేరుకునేవారు.. అలాగే గంట్లకుంట గ్రామం నుంచి పెద్దవంగరకు అధికారిక పనుల నిమిత్తం వెళ్లే రోడ్డుపై పోసిన కంకరతో వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. సంక్షిప్త రహదారుల విస్తరణకు గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన విషయం తెలిసిందే. మండల కేంద్రం నుంచి వయా రామచంద్రు తండా మీదుగా పోచారం వరకు 5 కిలోమీటర్లు రోడ్డు నిర్మాణం కోసం రూ. 6కోట్లు, పోచారం వయా వడ్డెకొత్తపల్లి వరకు 5.3 కిలోమీటర్లకు రూ. 6.35 కోట్లు, వడ్డెకొత్తపల్లి వయా బొత్తల తండా మీదుగా 3.1 కిలోమీటర్లకు రూ.3.76, పెద్దవంగర వయా అమర్‌సింగ్ తండా నుంచి కాన్వాయి గూడెంకు 9.6 కిలోమీటర్ల రూ. 9కోట్లు, చిట్యాల నుంచి వయా సూర్యతండా మీదుగా 5.3 కిలో మీటర్ల 3.30 కోట్ల నిధులు పీడబ్ల్యూడీ రోడ్ల నిర్మాణాలకు 2023 సంవత్సరంలో నిధులు మంజూరు కాగా పనులు ప్రారంభించారు. అయితే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు.



కంకర పోసి వదిలేసిన రోడ్డు

పనుల్లో జాప్యం..

రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా సంబంధిత కాంట్రాక్టర్లు ఆయా గ్రామాల్లోని పాత రోడ్లపై ఉన్న డాంబర్‌ను తొలగించి కొత్త రోడ్డు నిర్మాణం కోసం కాంక్రీట్, మొరం పోశారు. ఈక్రమంలో అటు వైపు రాకపోకలు సాగిస్తున్న వాహనాల దుమ్ము తీవ్రంగా ఉండడంతో ఆయా గ్రామాల్లోని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి పనులు పూర్తి అయ్యేంత వరకు కాంట్రాక్టర్‌తో నీళ్లు పట్టించేలా చర్యలు చేపట్టి రోడ్డు పనులు వేగవంతం అయ్యేలా చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

త్వరగా పూర్తి చేయాలి



గతేడాది నుంచి పనులు కొనసాగుతుండడంతో మండల కేంద్రానికి వచ్చి పోయేవారు ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని పనులు త్వరగా పూర్తి చేసే విధంగా చర్య తీసుకోవాలి.

\- పూర్ణచందర్, పెద్దవంగర

మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం

- ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్/మహబూబాబాద్ అర్బన్: సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాట ఇవ్వడమే కాకుండా అమలు చేసి చూపిస్తుందని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్ మండలంలోని చోక్ల తండా గ్రామ పంచాయతీ పరిధిలో గల మేగ్యా తండాలో సీడీఎఫ్ నిధులతో మంజూరైన రూ.5లక్షల వయ్యంతో నిర్మించనున్న సైడ్ డ్రెయినేజీ పనులకు, మున్సిపల్ పరిధిలోని అనంతారంలో సీసీరోడ్డు పనులకు సోమవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గణతంత్ర దినోత్సవం 26వ తేదీన కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు, రైతుభరోసా ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు మిట్టకంటి రాంరెడ్డి, నాయకులు భూక్యా సుందర్ నాయక్, గుగులోత్ మురళీ, బోడ సురేష్, లాలావత్ రమేష్, బోడ బాలకిషన్, నరేందర్ పాల్గొన్నారు.



మహబూబాబాద్ రూరల్: శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

క్రీడల్లో రాణించాలి

మహబూబాబాద్ అర్బన్: విద్యార్థులు యువత క్రీడలతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలో నూకల రామచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడల ముగింపు పోటీల్లో గెలుపొందిన క్రీడకారులకు ఎమ్మెల్యే బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సుజిత్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రూ.50వేల విరాళం అందజేత

కేసముద్రం: మండలంలోని ఇంటికన్నె గ్రామంలో శ్రీకంఠమహేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి మాజీ సర్పంచ్ గణపారపు సరిత, రమేశ్ దంపతులు రూ.50,016ల విరాళాన్ని ఆలయ నిర్వాహకులకు సోమవారం అందజేశారు.

తహసీల్దార్‌కు వినతి

నర్సింహులపేట: అర్హులకు రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని బీఆర్‌ఎస్ నాయకుడు బండి రమేశ్ అన్నారు. సోమవారం తహసీల్దార్ నాగరాజుకు వినతి పత్రం అందజేశారు. వెంకటేశ్వర్లు, నాగన్న, మదార్, శ్రీశైలం పాల్గొన్నారు.

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతా

- ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తొర్రూరు: తొర్రూరు మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. రూ.5.25 కోట్ల టీయూఎఫ్ఐడీసీ నిధులతో పట్టణంలో నిర్మించనున్న ఆడిటోరియంకు సోమవారం అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే స్థల పరిశీలన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, వైస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, కమిషనర్ శాంతికుమార్, మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, ఏఈ రంజిత్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ఎంపిక పారదర్శకంగా ఉండాలి

మరిపెడ రూరల్: నేటినుంచి ఈనెల 24 వరకు ఆయా గ్రామాల్లో గ్రామసభలను నిర్వహించి, అర్హులైన వారి నుంచి రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల వర్తింపు దరఖాస్తులు స్వీకరించాలని మండల ప్రత్యేక అధికారి, డీడబ్ల్యూహెచ్ఓ కిరణ్‌కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సైదులు, ఎంపీడీఓ విజయ, మండల వ్యవసాయ అధికారి వీరసింగ్, ఎంఈవో అనితాదేవి, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

దంతాలపల్లి: నేటి నుంచి ప్రారంభం అవుతున్న గ్రామసభల్లో పలు జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దారు రాజేశ్వర్, ఎంపీడీఓ వివేక్‌రామ్ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో సోమవారం వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి వీరన్న, ఏఓ వాహిని, ఆర్ఐ నజీముద్దీన్, ఎంపీఓ అప్సర్ పాషా పాల్గొన్నారు.



మరిపెడ రూరల్: సమీక్షలో పాల్గొన్న అధికారులు

కొత్తగూడ: ప్రభుత్వ పథకాల లబ్దిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలని తహసీల్దార్ రమాదేవి సూచించారు. మండల కేంద్రంలోని రైతువేదికలో జరిగిన సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేకాధికారి సురేష్, ఎంపీడీఓ రవీంద్రప్రసాద్, ఏఓ ఉదయ్, కార్యదర్శులు పాల్గొన్నారు.

పేదల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

తొర్రూరు/డోర్నకల్: పేదల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులేనని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బొల్లం అశోక్, శెట్టి వెంకన్న అన్నారు. ఈ నెల 25 నుంచి 28 వరకు సంగారెడ్డిలో జరిగే సీపీఎం రాష్ట్ర మహాసభల పోస్టర్లను సోమవారం పార్టీ నాయకులు ఆవిష్కరించారు. బొల్లం అశోక్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ మత రాజకీయాలు చేస్తూ ప్రజలను పక్కదోవ పట్టిస్తోందన్నారు. ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టడంలో సీపీఎందే కీలకపాత్ర అన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి యాకూబ్, నాయకులు సాంబయ్య, దర్గయ్య, స్వామి, అశోక్‌కుమార్, శ్రీనివాస్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

విద్యుత్ మోటార్ చోరీ

మహబూబాబాద్ రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని జమాండ్లపల్లి గ్రామానికి చెందిన పులిగుజ్జు వెంకన్న వ్యవసాయ భూమి నడివాడ గ్రామ శివారులో ఉండగా గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం సాయంత్రం మోటారును ఎత్తుకెళ్లారు. రూ.26వేల విలువ గల మోటార్ చోరీ జరిగిన సంఘటనపై సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

మూడు షాపుల్లో చోరీ

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని వివేకానంద సెంటర్‌లో గల మూడు దుకాణాల్లో రూ.47వేల నగదును ఎత్తుకెళ్లిన సంఘటన సోమవారం ఆలస్యంగా వెలుగు చూసింది. స్థానికంగా ఉన్న కొండ్లె వెంకటకుమార్‌కు చెందిన వాసవి కిరాణం, గాంతి ఉపేందర్ రెడ్డికి చెందిన బియ్యం షాప్, జంగిలి మధుకు చెందిన వాసవి పూజ స్టోర్, ఫ్యాన్సీ కంగన్ హాల్‌షాపుల్లో ఈనెల 16వ తేదీ గురువారం తెల్లవారుజామున దొంగలు చోరీలకు పాల్పడ్డారు. చోరీలకు పాల్పడిన వ్యక్తులు వాసవి కిరాణం షాపులో గల సీసీ ఫుటేజీల డీవీఆర్‌ను తీసుకెళ్లారు. జరిగిన సంఘటనలపై బాధితులు డయల్ 100కు ఫిర్యాదు చేయగా టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ ఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు.

పూరిల్లు దగ్ధం

కొత్తగూడ: మండలంలోని చెరువుముందు తండాకు చెందిన గుగులోతు లచ్చిరాం ఇంట్లో లేని సమయంలో పూరిల్లుకు ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుని పూర్తిగా దగ్ధం అయింది. ఈ ఘటనలో ఇంట్లో ఉన్న సామగ్రి కాలిపోయాయి.

కారు బోల్తా.. తప్పిన ప్రమాదం

నెల్లికుదురు: అదుపు తప్పిన ఓ కారు రోడ్డు పక్కకు దూసుకెళ్లి పల్టీ కొట్టిన సంఘటన మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పార్వతమ్మగూడెం గ్రామ పరిధిలోని ఓ గార్డెన్‌లో జరుగుతున్న పెళ్లి వేడుకలకు పెళ్లికొడుకుతోపాటు ముగ్గురితో మహబూబాబాద్ వైపు నుంచి కారులో వస్తున్నారు. గార్డెన్ సమీపంలో ప్రమాదవశాత్తు కారు టైరు పలిగి రోడ్డు పక్కకు దూసుకెళ్లి బోల్తా కొట్టింది. కారులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తికి స్వల్ప గాయాలు కాగా పెళ్లికొడుకు మరో ఇద్దరు పెను ప్రమాదం నుంచి తప్పించుకున్నట్లు తెలిపారు.

కత్తితో దాడి చేసిన వ్యక్తి రిమాండ్

తొర్రూరు రూరల్: యువకుడిపై కత్తితో దాడి చేసిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించిన ఘటన సోమవారం మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నాంచారిమడూరు గ్రామానికి చెందిన మంద యాకమల్లు అనే యువకుడు ఇంటికి వెళ్తుండగా వెలికట్ట శివారు పాలకేంద్రం వద్ద ఓ వ్యక్తి కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో యాకమల్లుకు గాయాలయ్యాయి. స్థానికులు అతడిని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. దాడికి పాల్పడిన వ్యక్తి పెద్దవంగర మండలం కొరిపెల్లి గ్రామానికి చెందిన ఎడ్ల చిరంజీవిగా పోలీసులు గుర్తించారు. క్షతగాత్రుడిని తండ్రి సోమనర్సయ్య ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

గార్ల: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్‌కె రియాజ్ పాషా సోమవారం తెలిపారు. మండలంలోని బుద్దారంతండా సమీపంలో గల ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద పేకాట ఆడుతున్న రమేష్, పాండుకుమార్, సంతూలాల్, సురేష్, సురేందర్, సంతోష్‌లను పోలీసులు పట్టుకొని వారి వద్ద నుంచి రూ.6,360 నగదు, 6సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వెల్లడించారు.

నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన

రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ ప్రభుత్వ పాఠశాలలో హెచ్‌ఎం రాములుపై జరిగిన దాడిని ఖండిస్తూ సోమవారం మధ్యాహ్న భోజన సమయంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. దాడులకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారం చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. - సాక్షి నెట్‌వర్క్



మహబూబాబాద్ అర్బన్: కంకరబోర్డు ప్రభుత్వ పాఠశాలలో నల్లబ్యాడ్జీలతో నిరసన..



మహబూబాబాద్ రూరల్: బ్రాహ్మణపల్లి ఎంపీయూపీఎస్ పాఠశాలలో..



నెల్లికుదురు: నర్సింహులగూడెం గ్రామంలో..



తొర్రూరు రూరల్: అరిపిరాలలో ..



కురవి: రాజోలులో..

చికిత్స పొందుతున్న ఇద్దరి మృతి

మహబూబాబాద్ రూరల్: ఆర్థిక ఇబ్బందుల కారణంగా పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన కేసముద్రం మండలం ఉప్పరపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై వి.దీపిక సోమవారం కేసు వివరాలు వెల్లడించారు. గ్రామానికి చెందిన మోరపాక ఉపేందర్(36 కు భార్య కల్యాణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా ఉపేందర్ కుటుంబం బతుకుదెరువు కోసం హైదరాబాదుకు వెళ్లి మేస్త్రి పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఉపేందర్ కొంతకాలంగా మనోవేదనకు గురవుతున్నాడు. ఈనెల 11వ తేదీన మహబూబాబాద్ మండలంలోని రెడ్యాల గ్రామంలో ఉండే వారి చిన్నమ్మ పోలాసు ఎల్లమ్మ ఇంటికి ఉపేందర్ చుట్టం చూపుగా వచ్చాడు. అదేరోజు సాయంత్రం సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా గమనించిన స్థానికులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా అక్కడే చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య కల్యాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

కురవిలో ఒకరు..

కురవి: రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలై చికిత్స పొందుతూ యువకుడు సడినం వినయ్(19) సోమవారం తెల్లవారుజామున ఆస్పత్రిలో మృతి చెందాడు. చిన్నగూడూరు మండలం మంగోరిగూడెం గ్రామానికి చెందిన సడినం వినయ్ బైక్‌పై కందికొండ స్టేజీ నుంచి కురవి వైపు ఆదివారం రాత్రి వస్తున్నాడు. ఈక్రమంలో ఎదురుగా వెళ్తున్న మరో బైక్‌ను ఢీకొట్టడంతో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సపొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి తండ్రి సడినం బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గండ్రాతిసతీష్ తెలిపారు.

సంక్షిప్త సమాచారం

ఆల్‌ఇన్‌వన్ పుస్తకాల పంపిణీ

గార్ల: మండలంలోని ముల్కనూరు హైస్కూల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు గూగులోత్ కౌసల్య లక్ష్మణ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆల్ ఇన్‌వన్ పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. రత్తీరాంతండా వాసి గూగులోత్ జగన్ తన తల్లితండ్రుల పేర్ల మీద జీకేఎల్ ఫౌండేషన్ స్థాపించి అమెరికాలో ఉంటూ పుస్తకాలు అందించాడు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసులు, రామసహాయం శ్రీధర్‌రెడ్డి, మేకల కృష్ణయ్య పాల్గొన్నారు.

నిధులు కేటాయించాలి

మరిపెడ రూరల్: ప్రజాప్రతినిధుల పాలన లేక గ్రామాల్లో అభివృద్ధి రోజురోజుకు కుంటుపడుతుందని, ప్రభుత్వం స్పందించి వెంటనే స్థానిక సంస్థలకు తక్షణమే నిధులు కేటాయించి వాటిని బలోపేతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు అల్వాల వీరయ్య డిమాండ్ చేశాడు. సోమవారం మండలంలోని చిల్లంచర్ల గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు వెంకన్న, రాజన్న, రామన్న, వీరేంకులు, నరేష్ పాల్గొన్నారు.

పాఠశాలకు రూ.3,601 అందజేత

కురవి: మండలంలోని సూదనపల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల అభివృద్ధికి తమ జీవితకాలం ప్రతీ ఏటా రూ.3,601లు అందజేస్తామని, గత ఏడాది నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని దాతలు కన్నెగంటి వెంకటరమణ, పద్మావతి దంపతులు తెలిపారు. సోమవారం పాఠశాలలో హెచ్‌ఎం దాఆవత్ వెంకన్నకు రూ.3601లను అందజేశారు. జీవితకాలం ఆర్థిక వితరణ పత్రాన్ని ఫ్రేం కట్టించి ఉపాధ్యాయులకు అందజేశారు. ఉపాధ్యాయులు ప్రదీప్‌కుమార్, సారంగం, బాలరాజు, అంజద్‌పాషా పాల్గొన్నారు.

ఆర్థికసాయం

కేసముద్రం: ఇనుగుర్తి మండలంలోని కోమటిపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ గ్రామ ప్రధాన కార్యదర్శి నీలం వెంకన్న అనేవ్యక్తి ఇటీవల మృతి చెందాడు. ఈ మేరకు సోమవారం గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ.34,200ల ఆర్థికసాయాన్ని అందజేశారు.

బోగస్ ఓట్లను తొలగించాలి



గూడూరు: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ పరిధిలో నమోదు అవుతున్న బోగస్ ఓట్లను తొలగించాలని బీఆర్‌ఎస్ పట్టణ కమిటీ అధ్యక్షుడు చీదురు వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్ కార్యాలయంలో ఏఎస్‌ఓకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రహీంపాషా, రాములు, రమేష్, సురేష్ నాయక్ పాల్గొన్నారు.

పాఠశాలకు గ్రీన్‌బోర్డు వితరణ

కురవి: సీరోలు మండలం కాంపల్లి జెడ్పీ హైస్కూల్‌కు గ్రీన్‌బోర్డ్‌ను నేరడ గ్రామానికి చెందిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ షేక్ జానీ సోమవారం బహూకరించారు.

26న మాంసం విక్రయించొద్దు

మహబూబాబాద్: ఈనెల 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఎటువంటి జంతువధ, మాంసం క్రయవిక్రయాలు చేయవద్దని మున్సిపల్ కమిషనర్ నోముల రవీందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధన అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలతో పాటు జరిమానా విధిస్తామని తెలిపారు.

జయప్రదం చేయండి

బయ్యారం: మంచిర్యాలలో ఈనెల 24న జరిగే పీడీఎస్‌యూ రెండు సంఘాల విలీనసభను జయప్రదం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి ఊకే పద్మ పిలుపునిచ్చారు. మండలంలోని గంధంపల్లి-కొత్తపేటలో సోమవారం సభపోస్టర్లను ఆవిష్కరించారు.

అబాకస్ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

తొర్రూరు: అబాకస్ పోటీల్లో పట్టణంలోని సిద్ధార్థ హైస్కూల్ విద్యార్థిని సుదగాని లాస్య హన్మకొండలోని బిషప్ బెరెట్టా హైస్కూల్‌లో నిర్వహించిన టెస్టులో ప్రతిభ కనబర్చింది.

గెలుపోటములు సహజం

మరిపెడ రూరల్: క్రీడల్లో గెలుపోటములు సహజమని మొదటి బహుమతి దాత శాస్త్రి అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని గిరిపురం గ్రామంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు సోమవారం ముగిశాయి. మొదటి బహుమతి ఉల్లెపల్లి టీమ్ రూ.10,016, ద్వితీయ బహుమతిని అంబేడ్కర్ యువసేన గిరిపురం, తృతీయ బహుమతిని బంగ్లా టీం గెలుచుకుంది.

బీజేపీ సత్తాచాటాలి

కేసముద్రం: వచ్చే స్థానిక సంస్థల, మున్సిపాలిటీ ఎన్నికల్లో బీజేపీ సత్తాచాటాలని పార్టీ మండల అధ్యక్షుడు ఉప్పునూతల రమేశ్ పార్టీ శ్రేణులకు సూచించారు. సోమవారం మండల కేంద్రంలో బీజేపీ మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నర్సింహారెడ్డి, శశివర్ధన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు ఆశవర్కర్ల పాదయాత్ర



మహబూబాబాద్ రూరల్: ఆశవర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో నేడు (మంగళవారం) మండల కేంద్రం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ఆశ వర్కర్లు పాదయాత్ర నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ అన్నారు. ఈమేరకు డీఎంహెచ్ఓ మురళీధర్‌కు ఆశవర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు సుజిత, కాశేశ్వరి, నిర్మల, హేమలత, సీఐటీయూ జిల్లా నాయకులు మల్లయ్య, శ్రీనివాస్, వెంకన్న పాల్గొన్నారు.